# పెళ్ళి

**- రాణి**

జీవితంలో మొదటిసారిగా భార్యను చూసి మురిసిపోతున్నాడు కేశవ రావు.

భార్య పార్వతి తన కూతురులిద్దరికీ ప్రసాదించిన అందాన్ని చూసుకుని గర్వప డుతున్నాడు. వద్దంటున్నా మనస్సు వరహాలరావుగాడి కొడుకు విజయ్ పెళ్ళి చుట్టే పరిభ్రమిస్తోంది.

పోయిన ఆదివారం వాడి పెళ్ళికి కుటుంబ సమేతంగా వెళ్ళాడు. ఒకే వీధిలోని వాళ్ళు పైగా దూరపు చుట్టరికమూనూ.

ఆపసోపాలు పడుతూ కళ్యాణమండపం చేరుకునేసరికి అర్ధగంటపైనే పట్టింది.

చుట్టాలుపక్కాలను మండపం చేర్చటానికి రెండుకార్లు, ఒక జీపు అరేంజ్ చేశానని వాడు అంటున్నాడు. ఏవీ..? ఒక్కటయినా వచ్చి ఛస్తేనా!

స్కూటర్‌ని స్టాండ్‌లో పెట్టి వచ్చేసరికి ఆటో నుంచి భార్యాపిల్లలూ దిగిపోయి నిలబడి లైట్ల డెక రేషన్‌ను చూడటంలో లీనమైవున్నారు.

పెళ్ళి బాగా గ్రాండ్‌గా జరుగుతోంది. లైట్ల డెకరే షను, మండపం సెట్టింగు, వీడియోలు అంతా అద రహో అనిపించేటట్టుగా వుంది.

ఇకపోతే డైనింగ్ హాలు గురించి చెప్పనలవికా వటం లేదు. ఎక్కడికక్కడ టి.వి.లు అరేంజ్ చేసి వున్నారు.

వడ్డించేవారంతా ఒకే యూనిఫామ్‌లో ముచ్చట గొలుపుతూ ఏమేమి ఐటమ్స్ కావాలో ఒక్కొక్క రినే అడిగి తెలుసుకుంటూ నమ్రతగా వడ్డిస్తు న్నారు. ఐదురకాల స్వీట్లు, మూడురకాల హాట్లు వెజిటబుల్ పలావ్‌తోపాటు కిళ్ళీ, ఐస్‌క్రీములూ, స్టీలు ప్లేట్లు కూడానూ.

వీడు మంచిపిల్లనే పట్టాడు. ఈ వెధవప్రక్కన పెళ్ళికూతురు అందంగా కూడా కనబడుతోంది. పెళ్ళి ఇంత గ్రాండ్‌గా జరిపిస్తారని కలలో కూడా అనుకోలేదు.

దీనికితోడు మ్యూజికల్ ప్రోగ్రాము ఒకటి. వాయి ద్యాల హోరుకి మేళతాళాల జోరు కూడా జత కలి సింది. ఇంకేముందీ..! కడుపులో మొదలైన సన్నని మంట గుండెలదాక వ్యాపించింది. అంతవరకు అలుముకున్న ఆనందం క్రమేపీ అసూయగా రూపాంతరం చెందుతోంది.

హఠాత్తుగా కళ్యాణమండపంలో కలకలం చెలరే గింది. వీడియో తీస్తున్నవాళ్ళు, ఫోటోగ్రాఫర్స్‌తో పాటు అక్కడున్న వాళ్ళందరూ ఎంట్రన్స్ డోరు వైపు పరిగెత్తడం చూసి అతను కూడా అటువైపు దృష్టి సారించాడు. వీడియో లైట్ల ఫోకస్‌మధ్య తెల్లటి సూట్‌లో నల్లగా మెరిసిపోతూ ప్రముఖ కమె డియన్ స్టార్ అనిల్‌కుమార్.

అందరితోపాటు అతను కూడా సంభ్రమాశ్చర్యా లకు లోనయ్యాడు.

అనిల్‌కుమార్ కుటుంబసమేతంగా పెళ్ళికి తరలి వచ్చాడు. పెళ్ళికూతురు వాళ్ళకు చుట్టాలవుతా రట! అందరూ అతని మీదకు ఎగబడిపోతూ అతని దృష్టిని ఆకర్షించాలని తెగ తాపత్రయపడుతు న్నారు. పలకరించాలని తపన పడిపోతున్నారు. ఆటోగ్రాఫ్ తీసుకునేవాళ్ళు తీసుకుంటున్నారు.


ఇంతలో వరహాలరావుగాడు, పెళ్ళికొడుకుగారి తండ్రి హోదాతో భార్యాసమేతంగా ఎదురొచ్చి స్వాగతం పలికాడు. ఆదరాభిమానాలతో తోడ్కొని వెళ్ళి కూర్చోబెట్టారు. ఇక్కడ పెళ్ళితతంగంతో పాటు అక్కడ డైనింగ్ హాల్లో భోజనాల తతంగము జరుగుతూ వుంది. ఎన్నోసార్లు వరహాలరావు భోజ నానికి ఆహ్వానించినా వెళ్ళలేదు. వాడి కుటుం బంతో కలిసి తిందామని ఆగిపోయారు. కాకపోతే వాడితో కలసి డైనింగ్ హాల్లో అతిథిమర్యాదలు చూస్తూ అప్పుడప్పుడు, కనిపించిన స్వీట్లను నోట్లో వేసుకుని చప్పరించేసేవాడు.

ఇంతలో పెళ్ళికూతురు తాలూకు పెద్దలు, పెళ్ళి కొడుకు వైపువాళ్ళను- ఒక్కొక్క ఫ్యామిలీనీ కమెడి యన్‌స్టార్ అనిల్‌కుమార్‌కు పరిచయం చెయ్యసా గారు. ఓ పది కుటుంబాల పరిచయవాక్యాల తర్వాత కేశవరావు వంతు వచ్చింది.

ఉక్కిరిబిక్కిరి అవుతూ భార్యాబిడ్డలతో వెళ్ళి పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత ఓ అరగంట వరకు వాళ్ళ కెదురుసీట్లలోనే కూర్చుని పిచ్చాపాటి కబుర్లు చెప్పాడు.

మాటకారి అయిన కేశవరావు సహజంగానే వారి దృష్టిని ఆకర్షించాడు. వాళ్ళకు ఆ పెళ్ళిలో అవి తంగా ఆకర్షించిన విషయం మరొకటి వుంది.

ఆ తర్వాత అందరూ భోజనాలకు లేచారు. నెమ్మ దిగా వాళ్ళ ప్రక్కసీట్లు ఆక్రమించేసి ఫ్యామిలీతో సెటిలయిపోయాడు కేశవరావు.



సినిమా కబుర్లు, షూటింగు విశేషాలతో ఓ గంటపైగా అక్కడ గడిపారు. కుశ లప్రశ్నలు, నూతన వధూవరులతో ఫోటోలు, గిఫ్టలు ప్రజంట్ చేసుకోవటాలు వంటి వగైరా కార్య క్రమాల అనంతరం వెళ్తామంటూ లేచారు.

టెన్త్ చదువుతున్న కేశవ రావు కొడుకయిన కిరణ్‌కి 'మెగా స్టార్' అంటే అమితమైన పిచ్చి. అనిల్ కుమార్ ఈమధ్యనే చిరంజీవితో రెండు సినిమాలు ఏక్ట్‌చేసే ఛాన్సు కూడా కొట్టేసి స్టార్ కమెడియన్ అయిపోయాడు.

అనిల్‌కుమార్‌లో చిరంజీవిని చూసుకుని మురిసిపోసాగాడు కిరణ్. చిరంజీవిని తాకిన

అతడి చేతులను మెల్లగా స్పృశించసాగాడు. అందరి దగ్గర వీడ్కోలు తీసుకుంటూ చివరలో కేశవరావుతో పదినిముషాలకు పైగా మాట్లాడటం, స్పెషల్‌గా కరచాలనం చేయటం వంటి అంశాలు ఆ తర్వాత అక్కడ చర్చనీయాంశములైనాయి. అదంతా తన ప్రతిభ, టాలెంటేనంటూ రొమ్ము విరుచుకుని తిరగసాగాడు కేశవరావు. అతని భార్య పార్వతి.. తను వయసులో ఉన్నప్పుడు పదిమంది దృష్టి ఎలా ఆకర్షించివుందో అనుభవ పూర్వకంగా తెలుసుకాబట్టి విషయాన్ని వెంటనే గ్రహించేసింది.

ఆమె ఊహ తప్పు కాలేదు. అనిల్‌కుమార్ వాళ్ళు ఊరు చేరుతూనే.. వెంటనే వరహాలరావును వియ్యంకుడితో కలిసి హైదరాబాదు రమ్మని కబురు చేశారు.

కేశవరావు ఫ్యామిలీ గురించి, అతని పిల్లల గురించి, ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండు వగైరా వగైరా లన్నీ ఆరా తీశారు. కేశవరావు వాగుడుకాయ, తల తిక్కవెధవ అయినా మొత్తానికి మంచివాడు. కాక పోతే స్టేటస్ అంటే పడి చచ్చే రకం. మిడిల్ క్లాసు ఫ్యామిలీ.. హైక్లాసు ఆలోచనలు.

ఇకపోతే అతని భార్య అందమైనదే కాదు తెలివి కలది కూడా. గడుసుదనంతోపాటు సంస్కారము మూర్తీభవించిన దొడ్డ ఇల్లాలు.

పిల్లలు ముగ్గురూనూ చిరంజీవి వీరాభిమానులు. కూతుళ్ళిద్దరూ తల్లికి మించిన అందగత్తెలు. రంగుతోపాటు రూపం, దానితోపాటు చదువు-సంస్కారం. ఇంతే సంగతులు చిత్తగించవలెను అంటూ కేశవరావు ఫ్లాష్‌బ్యాక్‌తో సహా వాళ్ళ అలవాట్లు, అభిరుచులు మొత్తం ఏకరవుపెట్టాడు వరహాలరావు.


అంతే... ఇంకొక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యలేదు వాళ్ళు. వెంటనే వరహాలరావు చేత విషయం తెలియజేశారు.

★ ★ ★

శరాఘాతంలా తగిలిన కూతురి నిర్ణయానికి విల విలలాడిపోయాడు. ఆగ్రహావేశాలతో ఊగిపోయాడు.

"ఏంటే! ఎందుకు చేసుకోనంటున్నావు. మనిషి నలుపనా..? నలుపు నారాయణమూర్తి. ఒళ్ళు నలుపైతేనేం ముఖం కళగానే వుందిగా!

సినిమాయాక్టర్ అల్లుడంటే ఎంత గొప్ప, ఎంత హోదా అని! మనం తలక్రిందుల తపస్సు చేసినా మళ్ళీ ఇటువంటి సంబంధం దొరుకుతుందటే..



కుర్రాడు బాగా కష్టపడేవాడు. ఇండస్ట్రీకొచ్చిన ఈ మూడేళ్ళలోనే ఎంత సంపాదించుకున్నాడనుకున్నావు?''

"నిజమే నాన్నా! నేనూ అదే విషయం మాట్లాడుతున్నాను. మొన్నీమధ్యనే ఓ సినీ మేగజైన్‌లో అతని ఇంటర్వ్యూ చదివాను. అతను షూటింగ్ స్పాట్ నుంచి ఇల్లు చేరుకొనేసరికి రాత్రి పన్నెండు అవుతుంది. తిరిగి మార్నింగ్ ఏడింటికే స్టూడియోకి వెళ్ళిపోతున్నాడు.

అవుట్‌డోర్ షూటింగ్స్ ఎటూ ఉండనే వున్నాయి. ఆ లెఖ్ఖన అతను ఇంట్లో గడిపే సమయమెంత? ఎప్పుడూ షూటింగ్స్ అంటూ అతడు బయట తిరుగుతూవుంటే.. ఇంట్లో కూర్చొని నేను ఒరగబెట్టేదేముందీ ఆయన తాలూకు జనానికి వండి- వడ్డించటం తప్ప.

నేనూ అందరిలాంటి ఆడపిల్లనే. నా భర్త నాతోనే ఎక్కువ సమయం గడపాలని కోరుకునే సగటు ఆడదానిని.

అయినా ఇప్పుడు నాకు హడావుడిగా పెళ్ళి చేయవలసిన అవసరం ఏముందని? డిగ్రీ పూర్తి చేసి పి.జి. కంప్లీట్ చేయాలి. కంప్యూటర్ కోర్స్ పూర్తి చెయ్యాలి. ఆ తర్వాతనే నా పెళ్ళి'' అని విసురుగా డాబా మీదకు వెళ్ళి పిట్టగోడకు ఆనుకుని ఒరగా నిలుచుంది.

హఠాత్తుగా ఎవరిదో చేయి మెత్తగా తన భుజం మీద పడేసరికి ఉలిక్కిపడి తిరిగి చూసింది. ఎదురుగా చెల్లెలు కనబడేసరికి 'అమ్మయ్యా!' అనుకుంటూ "నాన్న అమ్మను, మళ్ళీ రాయబారానికి పంపారనుకొని హడలి చచ్చాను'' అంటున్న అక్క వైపు తదేకంగా చూసింది.

"అక్కా.. నిజం చెప్పవే. ఈ పెళ్ళి ఎందుకు వద్దంటున్నావు?'' అంటూ అడుగుతున్న చెల్లెలికి జతగా ఇంతలో తమ్ముడు కూడా వచ్చి చేరేసరికి ఉక్కిరిబిక్కిరి అయిపోయింది.

"చెప్పక్కా! నాకు కాబోయే బావగారు ఓ సినిమా ఏక్టరని మా ఫ్రెండ్స్ అందరికి చెప్పేశాను. అక్కా.. నీ పెళ్ళికి చిరంజీవి వస్తారా? ఎంతమంది ఏక్టర్లు వస్తారు? చాలామంది వస్తారా.. అక్కా! ప్లీజ్.. ఒప్పుకోవే. ఒప్పుకో అక్కా!'' అంటూ గడ్డం పుచ్చుకుని బ్రతిమాలుతున్న తమ్ముడిని ఒక్క తోపు తోసింది.

"ఎంతసేపూ మీ గోలేనా! నా బాధనెవరూ అర్థం చేసుకోరేంటి?

అతడిని రిజెక్ట్ చేయటానికి కారణం కేవలం అతని రంగు కాదు రూపం అంతకన్నా కాదు. అతను బాగా హార్డ్‌వర్క్ చేస్తాడు. రాత్రింపవళ్ళు శ్రమిస్తున్నాడు. ఇది అందరికీ తెలిసిన విషయం. కాదనటం లేదే!

అయితే ఇండస్ట్రీలో ఇప్పుడతను ఆ పొజిషన్‌లో ఉన్నాడంటే అది కేవలం అతని టేలెంటు వల్ల కాదు. ఆడియన్స్‌ను నవ్వించి ఆహ్లాదపరుస్తున్నది, కేవలం అతని హావభావాల వల్ల కాదు. డైరెక్టర్లు, ప్రొడ్యూసర్లు.. అతడి ఒంటిరంగుని, లావుపాటి ముక్కును బండపెదాలను, అడ్డదిడ్డంగా పెరిగిన షేప్‌లెస్ బాడీని స్క్రీన్ మీద ప్రొజెక్ట్ చేసి మనల్ని నవ్విస్తున్నారు.

శాపవశాత్తు భగవంతుడిచ్చిన శారీరిక అవలక్షణాలని అతగాడు వెండితెరమీద మరింత మెరిపిస్తూ, మనలను మురిపిస్తున్నాడు.

అతడిని ఒక కమెడియన్‌గా తెర మీద చూస్తూ నేనూ ఓ ప్రేక్షకురాలిగా ఎంజాయ్ చేస్తాను. మా ఇద్దరికీ కనుక వివాహమయి అతను నా లైఫ్ పార్టనర్ అయితే.. నేను ఒక అనిల్‌కుమార్ భార్యగా కాక వంకరలు పోతున్న శరీరంతో అందరినీ నవ్వించే ఒక కమెడియన్ భార్యగా మాత్రమే గుర్తింపబడతాను.


రేపు మేము దంపతులైన తర్వాత.. ఏ ఫంక్షన్‌కయినా, పార్టీకయినా అటెండ్ అయితే- అక్కడ జనానికి, ఆయనను చూడగనే నవ్వు వచ్చి పడీ పడీ నవ్వుకుంటారు. ఆ నవ్వు అతడి ఫేస్, ఫిగర్‌ని చూసి కాదు. అతడిని మించిన అనాకారులు ఈ భూమ్మీద బోలెడంత మంది ఉన్నారు. ఆ నవ్వు అతడిని చూడగానే ఆ స్టార్ చేసిన కామెడీ సీన్స్ గుర్తుకొచ్చి!

భార్యగా అది నేను భరింపరాని, సహించలేని విషయం. అదే అనిల్‌కుమార్ ఓ సాధారణ గుమస్తాగా నా ఎదుట నిలబడమను.. తలవంచుకుని తాళి కట్టించుకుంటాను. ఓ భార్యగా, అతను- హాస్యం పేరిట అపహాస్యం పాలవటం నాకిష్టముండదు'' అప్పటివరకు ఆవేశపూరితంగా మాట్లాడి వెనుతిరిగి మెట్లు దిగబోతూ ఉలిక్కిపడి ఆగిపోయింది.

నీళ్ళు నిండిన కళ్ళతో అక్కడ నిలబడివున్న తండ్రిని చూస్తూనే.. అప్పటివరకు తాను మాట్లాడినవన్నీ విన్నారన్న విషయం గ్రహించటానికి ఆమెకు అట్టే సమయం పట్టలేదు.

"నాకు స్టేటస్ పిచ్చి వుంది కాదనను. కానీ బలవంతంగా కూతురి మెడలో తాళి కట్టించేటంతదుర్మార్గుడు మటుకు కాదమ్మా ఈ పిచ్చోడు'' అంటున్న తండ్రిని చూస్తూ రిలీఫ్‌గా నిట్టూర్చింది.

★




# మిస్ యూనివర్స్ మిస్సయిన వ్యక్తి!

ఇటీవల రష్యాలో జరిగిన మిస్ యూనివర్స్ పోటీలో మిస్ యూనివర్స్‌గా ఎన్నికయిన పెడరోవ్ నిజంగా మిస్ కాదని, మిసెస్ అని తెలియడంతో 'మిస్ యూనివర్స్' టైటిల్‌ను కాన్సిల్ చేసారు. రహస్యంగా పెళ్లి చేసుకుని గర్భవతిగా ఉండి ఈ పోటీలో పాల్గొన్నందుకు ఆమెకు గట్టిగా వార్నింగ్ ఇచ్చారుట. రెండవ స్థానంలో నిలిచిన పనామా అమ్మాయికి మిస్ యూనివర్స్ టైటిల్‌ను అందజేసారు. అనుకోకుండా దక్కిన ఈ అదృష్టానికి ఆమె మురిసిపోతూ ఎయిడ్స్ వ్యాధి నివారణకు ప్రచారం చేస్తానని మాట ఇచ్చిందిట.

# సైన్యంలో చేరండి

ఏడాదికి పదిహేనువేలమంది సైన్యంలో చేరేవారట ఇదివరకు ఇంగ్లండ్‌లో. అలాంటిది ఇప్పుడు సైన్యంలో చేరేవారి సంఖ్య పదిహేనువందలు కూడా దాటడంలేదుట. ప్రజల్లో చైతన్యం రావడానికి అక్కడి ప్రభుత్వం ప్రత్యేకంగా కౌన్సిలింగ్ క్లాసులు, టీవీ ప్రకటనల ద్వారా దేశభక్తి పెంచుతోందట. సైన్యంలో చేరిన వారందరూ యుద్ధాలు చేయనక్కర్లేదని, కొందరు సివిల్ సర్వీసెస్‌లోను, డాక్టర్లగానూ, ఇంజనీర్లగానూ ఉండవచ్చని సెలవిస్తున్నారు.



\- ప్రియ

